నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 11 అక్టోబర్ 2024 | MEDAK

మహిషాసురమర్ధినిగా

దుర్గామాత

పాపన్నపేట, అక్టోబర్ 10: తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం వన దుర్గాభవాని మాత మహిషాసుర మర్ధిని సహిత మహాగౌరి రూపంలో దర్శనమిచ్చారు. గోకుల్ షెడ్‌లో నూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తువలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సంగారెడ్డిలో బతుకమ్మ వేడుకలు

సిద్దిపేట పట్టణంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కుటుంబసమేతంగా పాల్గొని చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పూల సంబురం

- అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు
- కుటుంబ సమేతంగా హాజరై మాజీ మంత్రి హరీశ్ రావు

మెదక్ జిల్లా పెద్దశంకరంపేట, మాధవనగర్ కాలనీలో గౌరమ్మకు పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు సాగిన బతుకమ్మ వేడుకలు గురువారం ముగిశాయి. పూలసింగిడి నేలకు దిగిందా అనే విధంగా చౌరస్తాలన్నీ బతుకమ్మలతో మురిసిపోయాయి. సాయంత్రం వేళ గ్రామాల్లోని చావిడిలన్నీ బంగారు వర్ణాన్ని సంతరించుకున్నాయి. సిద్దిపేట పట్టణంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే సతీమణి శ్రీనిత క్యాంప్ కార్యాలయంలో, 4వ వార్డు హనుమాన్ టెంపుల్ వద్ద, శివాజీ నగర్‌తోపాటు పట్టణంలో పలుచోట్ల పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను సెలక్టు చేసి వారికి చీరలు అందజేశారు. అనంతరం కోమటి చెరువు వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, కౌన్సిలర్ కొండం కవితాసంపత్ రెడ్డిలతో కలిసి బతుకమ్మ ఆడారు. పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే పండుగ బతుకమ్మ అని, ప్రపంచంలో ఒక్క తెలంగాణకే సొంతం అన్నారు. సిద్దిపేట కోమటిచెరువు వద్ద జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అత్యంత గొప్పగా జరుపుకొనే పండుగ బతుకమ్మ అని, బతుకమ్మ పండుగతో దేశ, విదేశాల్లో తెలంగాణ ఖ్యాతి పెంపొందిందని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని కోరారు. కేసీఆర్ బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తించారన్నారు. గతంలో బతుకమ్మ పండుగకు కేసీఆర్ ఆడబిడ్డలకు చీరలను అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మకు రెండు చీరలతోపాటు రూ.500 ఇస్తామని చెప్పి ఎక్కడా ఇవ్వలేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, పాల సాయిరాం పాల్గొన్నారు.

సిద్దిపేట/మెదక్/సంగారెడ్డి, అక్టోబర్ 10

చిన్నకోడూరు : చంద్లాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

సిద్దిపేటలో చీరలను బహుమతిగా అందజేస్తున్నహరీశ్‌రావు సతీమణి శ్రీనిత

సిద్దిపేట కోమటి చెరువులో బతుకమ్మలు వేస్తున్న మహిళలు

సిద్దిపేట కోమటి చెరువు వద్ద మహిళలకు అభివాదం చేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

దుబ్బాకలో సద్దుల బతుకమ్మ పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి(ఇన్‌సెట్‌లో)పెద్దచెరువులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకలో సద్దుల బతుకమ్మ సందడి

దుబ్బాక, అక్టోబర్10: దుబ్బాక నియోజకవర్గంలో గురువారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ముస్తాబు చేశారు. మహిళలు బతుకమ్మ పాటలతోపాటు కోలాటాలు ఆడుతూ పండుగను సంబురంగా జరుపుకున్నారు. అనంతరం స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లోనూ సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ..మన సంస్కృతీసంప్రదాయాలను ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అతివల అతి పెద్ద పండుగగా బతుకమ్మను జరుపుకుంటామన్నారు. పూలను పూజించే గొప్ప సంస్కృతి మన తెలంగాణదని పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, భూంరెడ్డి, ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, పులిగారి ఎల్లం, ఆస స్వామి, యాదగిరి, దేవుని లలిత, రామస్వామిగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట తాగునీటికి కటకట

- 24 రోజులుగా వేతనాల కోసం మిషన్ భగీరథ కార్మికుల ఆందోళన
- 75 గ్రామాలకు నిలిచిపోయిన నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న ఆయా మండలాల ప్రజలు
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

న్యాల్‌కల్ మండలం చీకూర్తి గ్రామంలో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న తాగునీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

జహీరాబాద్, అక్టోబర్ 10: పండుగ పూట జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్‌లలో ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. 24 రోజులుగా దాదాపు 75 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాఘవాపూర్ శివారులోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ నుంచి ఆయా మండలాలకు తాగునీరు సరఫరా అవుతుంది. అక్కడ పని చేసే తాత్కాలిక కార్మికులకు ఎనిమిది నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదు. పలుమార్లు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు తమ గోడును వెల్లబోసుకున్నా ఫలితం లేకపోవడంతోనే అందోళనకు దిగినట్లు కార్మికులు తెలిపారు. మిషన్ భగీరథ నీళ్లను నమ్ముకున్న జనం ముప్పుతిప్పలు పడుతున్నారు. పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. ట్యాంకర్ల వద్ద జనం గుమికూడడంతో మహిళల మధ్య ఘర్షణకు తావిస్తోంది. దీంతో గ్రామాల సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా..ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది వాస్తవమే.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికుల వేతనాల కోసం అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చిస్తున్నామన్నారు. కార్మికులకు రావాల్సిన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థినులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెడికల్ విద్యార్థులకు హరీశ్‌రావు బాసట

సిద్దిపేట, అక్టోబర్ 10:ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు వైద్య విద్యార్థులకు మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు బాసటగా నిలిచారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని నర్సాపురానికి చెందిన కొంక శారద-రామచంద్రం దంపతులకు నలుగురు కూతుళ్లు ఎంబీబీఎస్ సీట్లు సాధించడంపై ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. దర్జీ పనిచేస్తూ నలుగురు కూతుళ్లను చదివించడంతో కుమార్తెలు అమ్మానాన్నల కలలను సాకారం చేస్తూ ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. వీరిలో పెద్ద కుమార్తె మమత 2018 ఎంబీబీఎస్ ప్రవేశం పొంది డాక్టర్ చదువును పూర్తి చేసుకుంది. రెండో కుమార్తె మాధవి 2020లో ఎంబీబీఎస్‌లో చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీలో చదువుతుంది. ఈ సంవత్సరం మరో ఇద్దరు రోహిణి, రోషిణి జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలోఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఆ విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలుపడంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ.50వేలు సహాయం అందించి వారిలో నేనున్నాని భరోసా నిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడం వల్ల అనేకమంది తెలంగాణ బిడ్డలు ఇక్కడే ఎంబీబీఎస్ పూర్తి చేస్తున్నారన్నారు. తెల్లకోటు విప్లవంతో పేద విద్యార్థులు వైద్య విద్య కలను సాకారం చేసుకుంటున్నారని చెప్పారు. కేవలం రూ.10 వేల ఫీజులో డాక్టర్ చదువులు చదవగలుగుతున్నారన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు కృతజ్ఞతలు

సిద్దిపేట తన కుటుంబం అనే మాటను హరీశ్‌రావు నోట ఎప్పుడూ వింటుంటాం..కానీ నేడు ప్రత్యక్షంగా చూశామని విద్యార్థులు తల్లిదండ్రులు చెప్పారు. సిద్దిపేట కుటుంబ పెద్ద మాకు అండగా నిలిచారన్నారు. ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయని సంతోషం పంచుకుందామని వచ్చామన్నారు. కానీ మా ఆర్థిక పరిస్థితి తెలుసుకొని మాకు సహాయం అందించిన హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లప్పుడు రుణపడి ఉంటామన్నారు.

గతంలోనూ ఇద్దరికి చేయూత

విద్య విషయంలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని హరీశ్‌రావు మరోసారి చాటి చెప్పారు. గతంలోనూ ఇద్దరు మెడిసిన్, ముగ్గురు నర్సింగ్ విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందించారు. నేడు హరీశ్‌రావు మరోసారి విద్యార్థులకు ఆర్థికంగా, అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.

కేసీఆర్ పాలనలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

సిద్దిపేట జిల్లా చేర్యాల కుడి చెరువు వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా

- బతుకమ్మ స్ఫూర్తితో చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు కృషి
- దుర్గామాత మండపాలు, శివాలయంలో ప్రత్యేక పూజలు
- జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 10: కేసీఆర్ పాలనలో అధ్యాత్మికత వెల్లివిరిసిందని, కాంగ్రెస్ పాలనలో అలాంటి పరిస్థితులు కనిపించడంలేదని జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం చేర్యాలలో దేవి స్నేహయూత్ నెలకొల్పిన అమ్మవారి మండపంలో దుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆకునూరులో భవాని రుద్రేశ్వర స్వామి వారి ఆలయంలో ఉల్లెంగల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు రుద్రేశ్వరి స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. మద్దూరు మండలంలోని మర్మాములలో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారికి పూజలతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేర్యాల కుడి చెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దేవాలయాల అభివృద్ధికి పాలకులు నిధులు మంజూరు చేయలేదని, కేసీఆర్ పాలనలో దేవాలయాలకు నిధులు మంజూరు చేసి భక్తులకు వసతులు కల్పించినట్లు చెప్పారు. అర్చకులకు నెలనెలా వేతనాలు వచ్చే విధంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి దానికి మార్గదర్శకాలు ఇచ్చి వారికి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి బతుకమ్మకు విడదీయరాని బంధం ఉందని, తొలి, మలి దశ ఉద్యమాల్లో బతుకమ్మ పాత్ర ఎంతో గొప్పదన్నారు. బతుకమ్మ స్ఫూర్తితో చేర్యాల ప్రాంత వాసుల చిరకాల కోరికైన రెవెన్యూ డివిజన్ సాధించుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఏకానందం, మాజీ జడ్పీటీసీ పద్మ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, మాజీ ఎంపీపీలు మేడిశెట్టి శ్రీధర్, వుల్లంపల్లి కరుణాకర్, బీఆర్ఎస్వీ ప్రధానకార్యదర్శి గదరాజుచందు, బైరగోని పశుపతి, సంతోష్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ సుమలతామల్లేశం, మాజీ సర్పంచ్‌లు స్రవంతీపర్శ రాములు గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

శివ్వంపేట: గోమారంలోని తన నివాసంలో బతుకమ్మను సిద్ధం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థల పరిశీలన

పుల్కల్, అక్టోబర్ 10: ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం గురువారం మండలంలోని బస్వాపూర్ శివారులో 417 సర్వే నెంబర్‌ను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో ప్రభుత్వం తొందరలోనే రెసిడెన్షియల్ కాంప్లెక్స్ పనులను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అందులో భాగంగానే బస్వాపూర్ శివారులోని 417 సర్వే నంబర్‌లో 20 ఎకరాలను గుర్తించామని కలెక్టర్‌కు తహసీల్దార్ కృష్ణ వివరించారు. ఇక్కడ ఎన్ని ఎకరాలు ఉంటుందని తహసీల్దార్‌ను ప్రశ్నించగా 33 ఎకరాలు ఉంటుందని తెలిపారు. దీంతో కలెక్టర్ 20 ఎకరాలతో పాటు మరో 5 ఎకరాలు కూడా చదును చేసి ఉంచాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

బస్వాపూర్ శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి